1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

మంగళవారం | మార్చి 19, 2024 | www.navatelangana.com

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ధీమా

నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ధీమాగా ఉండొచ్చని ఆదిలాబాద్ బ్రాంచ్ మేనేజర్ కార్తీక్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ఊర్మిళ జులై, 2023లో ఎస్‌బీఐ లైఫ్ సరల్ శ్వధాన్ ప్లస్ పాలసీ చేయించారు. ఆమె గుండెపోటుతో మృతి చెందడంతో తల్లిదండ్రులకు సహజ మరణం రిస్క్ కవరేజ్ కింద రూ.4,75,000 చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఏజెన్సీ మేనేజర్ సురేష్ నాయక్, లైఫ్ మిత్రా అడ్వైజర్ జాదవ్ వసంత్‌రావ్ పాల్గొన్నారు.



రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన పెందూర్ సునీల్(27) సోమవారం తెల్లవారుజామున ప్యాసింజర్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..సునీల్ హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తుండేవాడు. రెండు నెలల క్రితం ఇంటికి వచ్చాడు. ఈ వయసులోనే నాలుగు డబ్బులు సంపాదించుకోవాలని కుటుంబ సభ్యులు గట్టిగా చెప్పడంతో ఆవేశంతో రైలు కింద పడ్డాడు. తలపై నుండి రైలు వెళ్లడంతో తల, శరీరం వేరు అయ్యాయి. తండ్రి భూమన్న ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పీఓ ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

- వార్డెన్ సస్పెన్షన్‌కు ఆదేశాలు
- ఇద్దరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల గదులను, సరుకులను, కూరగాయలను పరిశీలించారు. కాస్మోటిక్ వస్తువులను సక్రమంగా అందిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు సరిపోవడం లేవని విద్యార్థులు పీఓ దృష్టికి తీసుకొచ్చారు. కుక్ మహేందర్, వాచ్‌మెన్ విజయ్ స్థానంలో వేరే వ్యక్తులు పనిలో ఉండడంతో వారికి షోకాజ్ నోటీసులు, వార్డెన్ స్వప్న అందుబాటులో లేకపోవడంతో సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సమయాల్లో సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో చదివించాలన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్స్, నాణ్యమైన భోజనాన్ని ప్రతిరోజు పెట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అవసరమైన గదులను, మరుగుదొడ్లను నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. కేంద్రాల్లోకి ఉదయం 8:45 నుంచే విద్యార్థులను అనుమతించారు. హాల్ టికెట్లను, విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం లోనికి అనుమతించారు. 10,0507 మంది విద్యార్థులకుగాను జిల్లా వ్యాప్తంగా 53 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. కనీస వసతులైన తాగునీరు, ఫ్యాన్లు, పైన కూర్చుని రాయడానికి వీలుగా ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. తొలి రోజు 35 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖధికారిణి ప్రణీత పేర్కొన్నారు.

బజార్‌హత్నూర్ : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలల విద్యార్థులు తమ తమ పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు. జాతర్ల సెంటర్లో 146 మంది విద్యార్థులకు 145 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదేవిధంగా మోడల్ స్కూల్‌లో కేంద్రంలో 215 మంది విద్యార్థులకు 214 విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా స్థాయి పరిశీలకులు రాథోడ్ ఉదయరావు సందర్శించారు.

ప్రతి ఒక్కరూ ఇండ్లలో పక్షి గూళ్లు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఇండ్లలో పక్షి గూళ్లను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్ అన్నారు. మండలంలోని మస్కాపూర్ గ్రామ కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రకృతితో స్నేహం పక్షులకు సహాయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జీవన విధానం ప్రకృతితో ముడిపడి ఉందని, ప్రకృతిలో పక్షుల పాత్ర ముఖ్యమైందని అన్నారు. పంట పొలాల్లో పురుగులను తిని పంట దిగుబడిలో, జంతు కళేబరాలను తిని వాతావరణ కాలుష్యం తగ్గించడంలో పక్షుల పాత్ర కీలమని పేర్కొన్నారు. మానవులు చేసే కొన్ని తప్పిదాల వల్ల చాలా రకాల పక్షులు అంతరించిపోతున్నాయని తెలిపారు. వేసవిలో పక్షులకు, మూగ జీవాలకు నీటి తొట్టెలు, బర్డ్ ఫీడర్‌లు, పక్షి గూళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నీటి తొట్టెలు, బర్డ్ ఫీడర్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-తలమడుగు

నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఫణిందర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంపీపీపై వెంటనే చర్య తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద్, పంచాయతీ కార్యదర్శి అశోక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-తలమడుగు

డివిజినల్ పంచాయతీ అధికారి ఫణిందర్‌రావు సోమవారం గ్రామ పంచాయతీ రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీలోని ఇంటి పన్నులు, వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని తాగునీటి ట్యాంకు, మిషన్ భగీరథ పైపు లీకేజీ మరమ్మతుల పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ వినోద్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఘనంగా శ్రీ రాజరాజేశ్వర కళాశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని గిర్నూర్‌లో గల శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ జానపద కళాకారుడు రేలారేలా చాకటి రవి బృందం, ప్రముఖ నృత్య కళాకారుడు రాజరాజేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థి వెంకటేష్ బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఎట్టం రాజేశ్వర్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ చాటే గణేష్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలంగాణ జానపద కళాకారుడు రవి యువతను ఉద్దేశించి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో ఆ ఉత్తేజమేదీ..?

- పార్టీని వీడిన నాయకులు..అదే దారిలో మరికొందరు
- గులాబీ పార్టీలో గుబులు రేపుతున్న పరిణామాలు
- లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీ శ్రేణుల్లో కలవరం

నిన్న..మొన్నటి వరకు ఓ వెలుగు వెలిగిన పార్టీ.. ఉద్యమ కాలం నుంచి పదేండ్ల పాటు అధికారంలో ఉన్నన్ని రోజులు ఆ పార్టీకి తిరుగులేదు. ఆ పార్టీ టికెట్ సాధించేందుకు పదుల సంఖ్యలో పోటీపడే వారు. కానీ ప్రస్తుతం పరిస్థితులు తారుమరయ్యాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోగానే..ఆ పార్టీ పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. ఇన్నాండ్లు మా గుండెల నిండా గులాబీ జెండా అని వెలుగెత్తిచాటిన నాయకులు ఆ జెండాను వదిలివెళ్లిపోయారు. అదే దారిలో మరికొందరు కీలక నాయకులు సైతం ఆ జెండాను వదిలేందుకు సిద్ధమవుతుండటం ఆ చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికే కొందరు నాయకులు పార్టీ వదిలివెళ్లిపోగా.. మరికొందరు కీలక నాయకులు సైతం అదే దారి ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల వేళ కీలక నాయకులు పార్టీ వదిలివెళ్లిపోతుండటం ఆ పార్టీ శ్రేణులను కలవరానికి గురిచేస్తోంది. నాయకులు వెళ్లిపోతున్నా.. అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. మరోపక్క ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి పునరుత్తేజం దిశగా అడుగులు వేయాలని ఆ పార్టీ అధినేత నాయకులకు దిశానిర్ధేశం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఇటీవల మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉద్యమ సమయం నుంచి తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో పదేండ్ల పాటు అధికారంలో కొనసాగిన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఉమ్మడి జిల్లాలోనూ తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఇది వరకు ఇద్దరు ఎంపీలు..పది మంది శాసనసభ్యులతో పాటు స్థానిక సంస్థల్లోనూ ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే నాటికి ప్రజాప్రతినిధులు, నాయకులతో నిండుకుండలా కనిపించిన గులాబీ పార్టీ ఎన్నికల్లో ఓటమి చెంది రాష్ట్రంలో అధికారం కోల్పోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. పది అసెంబ్లీ స్థానాల్లో కేవలం బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో రెండింటిలో మాత్రమే విజయం సాధించింది. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం.. కాంగ్రెస్ ఆ స్థానాన్ని దక్కించుకోవడంతో క్రమంగా గులాబీ పార్టీలో కీలకంగా ఉన్న నాయకులు ఆ పార్టీని వీడటం మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే తొలుత పలు మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశమయ్యాయి. పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గులాబీ గూటిని వీడి హస్తం పార్టీలోకి చేరుతుండటం చర్చనీయాంశమవుతోంది.

పార్టీని వీడుతున్న కీలక నాయకులు..!

బీఆర్ఎస్‌లో ఉంటే రాజకీయ భవిష్యత్తు ఉండదనే ఉద్దేశంతో పలువురు కీలక నాయకులు ఆ పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు ఆ నియోజకవర్గం కీలక నాయకులు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఇంతకుముందే ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మెన్ అడ్డిభోజారెడ్డితో హస్తం పార్టీలో చేరగా.. ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలోకి వెళ్లిపోయారు. మరోపక్క మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సైతం గులాబీ గూటిని వీడుతారని ప్రచారం జరుగుతోంది. గురువారం హైదరాబాదులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని కీలక నాయకులతో సమావేశం ఏర్పాటుచేయగా.. ఈ సమావేశానికి ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి గైర్హాజరుకావడం వారు పార్టీ మారుతారనే ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది. వీరితో పాటు మరికొందరు మంది కీలక నాయకులు సైతం పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది.

ఆ పార్టీ శ్రేణుల్లో కలవరం..!

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ అధినేత ప్రకటించారు. ఇప్పటికే బీజేపీ నుంచి మాజీ ఎంపీ గోడం నగేష్‌ను పేరు ఆ పార్టీ అధిష్టానం ప్రకటించగా.. కాంగ్రెస్ ఈ నెల 18న అభ్యర్థిని ఎంపిక చేయనుందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా లోక్‌సభ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన కీలక నాయకులు పార్టీని వీడుతుండటంతో ఆ పార్టీ శ్రేణులను కలవరానికి గురిచేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అధిక స్థానాలు కోల్పోయినప్పటికీ ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మాత్రం బీజేపీ, కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ పార్టీ అధిక ఓట్లు సాధించింది. సీట్లు కోల్పోయినా..ఓట్లు వచ్చాయనే ధీమాతో ఆ పార్టీ అధిష్టానం లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని ఆ పార్టీ కీలక నాయకులకు దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. ఆదిలాబాద్ లోక్‌సభ సీటును కైవసం చేసుకొని మళ్లీ పునరుత్తేజం దిశగా అడుగులు వేయాలని సూచించినట్లు సమాచారం. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ..రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ఎదుర్కొని నిలబడటం ఆ పార్టీకి సవాల్‌గా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్నికల సంఘం..

నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంసిసి, సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్సు బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసిసి, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు సంబంధించి వాహనాలు, ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు అందించాలని సూచించారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల లోపు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో, బస్టాండ్, రైల్వేస్టేషన్ పెట్రోల్ బంక్ ఇతర పబ్లిక్ ప్లేస్‌లలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నెంబర్, అలాగే పబ్లిషర్ పేరు, వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని, ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సి ఉంటుందని తెలియపర్చాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, మద్యం అలాగే రూ.50వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్‌డిఓ రత్నకళ్యాణి, జడ్పి సీఈఓ గోవింద్, డీఈఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

ఆసిఫాబాద్ : లోక్‌సభ ఎన్నికలు-2024 కార్యాచరణ విడుదల అయిన నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, ఖర్చులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులకు సహకరించాలని తెలిపారు.

నస్పూర్ : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జిల్లాలోని 3 శాసనసభ నియోజకవర్గాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, ఎసిపి ప్రకాష్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నగదు, మద్యం, కానుకల తరలింపు, నిఘా ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను ప్రలోభపెట్టే అంశాలైన నగదు, మద్యం, కానుకల రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల ఏర్పాటుతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్, వీడియో సర్వేయలెన్స్ బృందాల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రూ.10లక్షలకు మించి నగదు తరలించినట్లయితే ఆదాయ పన్ను శాఖ అధికారులు సీజ్ చేయాలని, సి-విజిల్ ద్వారా ఫిర్యాదులు అందిన 100 నిమిషాల లోపు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం, కానుకలను తరలించినట్లయితే ఆ వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఆబ్కారీ, మద్యనిషేధ శాఖ అధికారి నందగోపాల్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్ కుమార్, ఆదాయ పన్ను, రాష్ట్ర, కేంద్ర జీఎస్‌టి శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పోలింగ్ బూత్‌లను సందర్శించిన పంచాయతీ అధికారి

నవతెలంగాణ- ఖానాపూర్

రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మండల పంచాయతీ అధికారి చంద్రశేఖర్ సందర్శించారు. పోలింగ్ బూత్‌లను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు సేకరించారు. ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంగన్వాడీలలో పోషణ పక్వాడా కార్యక్రమాలు నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలలో పోషణ పక్వాడ(పోషణ పక్షం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ పక్షం అన్ని అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించాలన్నారు. పెరటి తోటలో అనుబంధ పౌష్టిక ఆహారంపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో పౌష్టికాహార లోపం అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అంగన్‌వాడి కేంద్రాలలో పోషణ్ పక్వాడ నిర్వహించాలని తెలిపారు. పోషణ పక్షం కార్యక్రమంపై చిరుధాన్యాల ఉపయోగం, ప్రాధాన్యత గురించి మార్చి 23 వరకు గ్రామస్థాయిలో అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అవగాహన కలిగించాలని, వచ్చే బుధవారం విలేజ్ హెల్త్ సానిటేషన్, న్యూట్రిషన్ డే సందర్భంగా అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో లైన్ డిపార్ట్మెంట్ వారిని పిలిచి వంటకాల ప్రదర్శన రక్తహీనత, తదితర అంశాలపై నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించాలని, దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, హెల్త్ ఎడ్యుకేషన్, సివిల్ సప్లై డీఆర్డిఎ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) కార్యదర్శి అగ్గిమల్ల స్వామి అన్నారు. 9 నెలల పెండింగ్ ఈపీఎఫ్ చెల్లించాలని, ఈఎస్ఐ పేరుతో కట్ చేసిన కోటీముప్పై ఆరు లక్షలు కార్మికులకు చెల్లించాలని కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సానిటేషన్ కార్మికులు, డ్రైవర్లు వాటర్ సప్లయ్ కార్మికులకు రెండునెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరి ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ కార్మికుల నుండి కటింగ్ చేస్తున్న నగదును ఖాతాలో జమచేయడం లేదన్నారు. ఇలా 9నెలలుగా దాదాపు కోటీ ముప్పై ఆరు లక్షలు కార్మికుల ఖాతాలో జమ కావాల్సి ఉన్నా ఇప్పటి వరకు జమ కాలేదన్నారు. దీనిపై తగు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని, కార్మికులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు రూ.1000 అమలు చేయాలన్నారు. వారాంతపు సెలవులు, పండగా సెలవులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి దర్శనాల నగేష్, జిల్లా నాయకులు ఎం.జనార్ధన్, అజీమ్, భారత్, మహేందర్, గగన్, రాజేశ్వర్, అంజి పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

మంగళవారం | మార్చి 19, 2024 | www.navatelangana.com

టికెట్ ఎవరికిచ్చిన గెలుపు దిశగా పని చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపై ఉందని ఎస్టీసెల్ జిల్లా చైర్మెన్, పార్లమెంట్ కోఆర్డినేటర్ సెడ్మకి ఆనంద్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, అధిష్టానం ప్రకటించే అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని అన్నారు. ఎంపీ సీటును కైవసం చేసుకుని రాహుల్ గాంధీకి గిఫ్టుగా ఇవ్వాలని, ఆయనను భావిభారత ప్రధానమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.



పంట నష్టంపై వ్యవసాయాధికారుల సర్వే

నవతెలంగాణ-లక్ష్మణచాంద

గత రెండు రోజులుగా కురిసిన ఆకాల వర్షానికి మండలంలో పంటలు నేలకొరిగాయి. దీంతో నష్టపోయిన రైతుల పంట నష్టం అంచనా వేసేందుకు సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పంట నష్టం అంచనా, ప్రాథమిక సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 631 రైతులకు చెందిన 1,087 ఎకరాలలో వరి, మొక్కజొన్న, నువ్వు పంట దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్టు తెలిపారు. పంట నష్టం అంచనా సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది జాదవ్ ఉమ, పవిత్ర, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలం పార్పెల్లి తండలో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. బానోత్ రాజు ఇంటిలో నిల్వ ఉన్న 4లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో మొత్తం 100 లీటర్ల వరకు గుడుంబా తయారీకి ఉపయోగించే నానపెట్టిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఏస్సై తెలిపారు. గుడుంబా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై గంగాధర్, కానిస్టేబుళ్లు కిరణ్, సంజీవ్, గణేష్, భూమన్న, మోహన్‌లు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-ఇచ్చోడ

దినదినాభివృద్ధిలో దూసుకుపోతున్న ఇచ్చోడ మండల కేంద్రం అదే స్థాయిలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులకు, బాటసారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన సీఐ భీమేష్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం మండల కేంద్రంలో తాత్కాలిక బస్‌స్టాప్ వద్ద రోడ్డుకు ఇరువైపుల తోపుడు బండ్లు, ఆటో, టాటా మాక్స్, చిరు వ్యాపారులను తొలిగించారు. దీనితో కొంత మేర ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన పోలీసులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ భీమేష్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సమస్యపై దృష్టి సాధించడం జరిగిందన్నారు, ప్రయాణికులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరం ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. అందుకు వాహనదారులు, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణ్, ఈఓ సూర్య ప్రకాష్, ఎస్సై నరేష్ కుమార్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

- మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రోడ్లపై చెత్తను వేసి అపరిశుభ్రతకు కారణమయ్యే వ్యాపారులపై చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం హెచ్చరించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం ఆయన బస్ స్టాండ్, తెలంగాణచౌక్ ప్రాంతంలో డ్రైనేజీలను పరిశీలించారు. వ్యాపార సముదాయాల ముందు డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తను పారిశుధ్య కార్మికులతో తీసేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇరువైపుల దుకాణదారులు చెత్తను ఇష్టం వచ్చినట్టు రోడ్లపై వేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్లాస్టిక్, అట్టముక్కలు తదితర వ్యర్థాలను మున్సిపల్ చెత్తబండిలో వేసి పరిశుభ్రతకు సహకరించాలన్నారు. చెత్త నిర్వాహణలో, వ్యాపారులు, ప్రజలు స్వీయ నియంత్రణ పాటించి, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మున్సిపల్ సూచనలను ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రమశిక్షణతో ఆడి కప్‌ను సాధించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొంటున్న క్రీడాకారులు క్రమశిక్షణతో మంచి ప్రతిభను ప్రదర్శించి, కప్‌ను సాధించాలని జిల్లా ఓలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి సూచించారు. డిల్లీలో 28న జరిగే ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో సోమవారం ప్రారంభమైన శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని అనంతరం మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఖోఖో, కబడ్డీ క్రీడలు ఎక్కువగా అడుతారని తెలిపారు. 1980లో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తాము సైతం ఉత్సహంగా గ్రౌండ్‌ను సిద్ధం చేశామని గుర్తు చేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్న లేకున్నా క్రమశిక్షణతో ఆడి ప్రతిభను కనబర్చాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏఎస్ఓ హేమంత్ కోచ్ శివకృష్ణ, ఆనంద్ కుమార్, కార్తీ పాల్గొన్నారు.

తునికాకు బోనస్ చెల్లించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్
- అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా



నిరసన తెలుపుతున్న టీఏజీఎస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసులకు తునికాకు సేకరణ ప్రధాన ఆదాయమని, వారికి చెల్లించాల్సిన బోనస్ చెల్లించాలని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం అటవీశాఖ కార్యాలయం ఎదుట టీఏజీఎస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలకు తునికాకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ ఆదివాసులు వ్యవసాయంతో పాటు తునికాకు సేకరణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారికి ప్రధానంగా తునికాకు సేకరణ నుంచి ఆదాయం వస్తుందని అన్నారు. వారికి బోనస్ చెల్లించకపోవడంతో ఆదివాసులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, తునికాకు సేకరణను ఆపడం సరికాదన్నారు. కాంట్రాక్టర్‌పై ఆధారపడకుండా రాష్ట్ర ప్రభుత్వమే తునికాకు సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాల్లో తునికాకు బోనస్ డబ్బులు ఇచ్చారని, కేవలం వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలోనే గత 6 నెలలుగా బోనస్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. వెంటనే కార్మికుల ఖాతాలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. అనంతరం డీఎఫ్ఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, ఆదివాసులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో మొక్కజొన్నకు నష్టం

- 4వందల ఎకరాల్లో నేలకొరిగిన పంట



నెలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీస్తున్న రైతులు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలో బరంపూర్, పల్లి(కె), పల్లి(బి) గ్రామాల్లో సోమవారం వడగండ్ల వాన కురిసింది. ఈ వర్షానికి దాదాపు 4వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురువడంతో జొన్న, మొక్కజొన్న, పొగాకు పంటలు కళ్ళముందే నేలకొరిగాయి. దీంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ఇంకొద్ది రోజుల్లో చేతికొచ్చే దశలో ఉన్న పంటలు వడగండ్ల వర్షం బీభత్సవానికి పూర్తిగా నేలకొరిగిపోవడంతో ఏమి తోచని పరిస్థితులో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంటలు అతివృష్టి వల్ల దిగుబడి రాకపోవడంతో కనీసం రబీ పంటలోనైనా దిగుబడి రాబట్టుకునేందుకు రైతులు రాత్రనక పగలనక పంటలు పండించినప్పటికీ వాతావరణం సహకరించకపోవడంతో ప్రతి ఏటా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నట్లు రైతులు తెలిపారు. కనీసం ఈ రబి పంటల్లో నైనా అప్పులు తీర్చుకోవచ్చనే ఉద్దేశంతో పంటలు పండించినప్పటికీ ప్రకృతి కనకరించక పోవడంతో ప్రతి ఏట రైతులు నిరాశ చెందుతున్నట్లు తెలిపారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కేదారీశ్వర్‌రెడ్డి, మల్లేష్, గణేష్, రవీందర్‌రెడ్డి, రమాకాంత్, రంజిత్‌రెడ్డి కోరారు.

ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఈఓ రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

పదో తరగతి వార్షిక పరీక్షలను ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పగడ్బందీగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం పరీక్షా కేంద్రంలోనికి వెళ్లి పరీక్షల నిర్వహణ సరళని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్ష కేంద్రం ముందు భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరిని తనిఖీ చేసిన తరువాత లోపలికి పంపించాలని అన్నారు. సెల్ ఫోన్, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ మేరకు 8,924 విద్యార్థులకు గాను 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డీఈఓ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

- టీఎస్ఎఫ్ లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో మెరుగైన విద్యను అందించేందుకు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం లోగోను ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం సభ్యులు వెంకట్ నారాయణ, బి.రాహుల్‌లు మాట్లాడుతూ జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి, శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని అన్నారు. కామన్ స్కూల్ విద్యా విధానం కోసం కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం తెలంగాణ స్టూడెంట్ ఫోరం టీఎస్ఎఫ్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గొడం రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీర వినోద్ నాయక్, ఏఐఎస్బీ రాష్ట్ర అధ్యక్షుడు జీవారే రాహుల్, ఏఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదేరావు, కార్యదర్శి అశోక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, ఎస్వీఏ జిల్లా అధ్యక్షుడు సుజయ్, డిఎస్టి జిల్లా అధ్యక్షులు హరి ప్రసాద్, ఉపాధ్యక్షుడు సంతోష్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, మీరా రాకేష్, అనసూయ, మమత, నిఖిత, అశ్విని, రజిత విద్యార్థులు పాల్గొన్నారు.

లైసెన్స్ పొందిన ఆయుధాలు తీసుకెళ్లడం నిషేధం

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలో లైసెన్స్ పొందిన ఎటువంటి ఆయుధాలు తీసుకెళ్లడం నిషేధించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, లైసెన్స్ కలిగిన ఆయుధాలు, ఇతర కత్తుల వంటి ఆయుధాలు సెక్షన్ 144 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం కలిగి ఉండరాదని తెలిపారు. లైసెన్స్ కలిగిన గన్స్ వంటి ఆయుధాలను సమీప పోలీస్ స్టేషన్ అందజేయాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

దుర్గ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా ఆదిలాబాద్‌వాసి భార్గవ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్


ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దుర్గ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీసీఐ టౌన్‌షిప్‌కు చెందిన మద్దెల భార్గవ్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2023లో వెలువడిన సివిల్స్ ఫలితాల్లో 554 ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 2023 బ్యాచ్‌కు చెందిన భార్గవ్ ఛత్తీస్‌ఘడ్ క్యాడర్ ఐఏఎస్‌గా నియమితులయ్యారు. మొదటి దఫా శిక్షణను లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ ఆకాడమి ఆఫ్ ఆడ్మినిస్ట్రేషన్ ముస్సోరిలో పూర్తిచేసుకున్నారు. అనంతరం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దుర్గ్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మద్దెల భార్గవ్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

అరుదైన శస్త్ర చికిత్స

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో సోమవారం అరుదైన శస్త్ర చికిత్స చేసి ఓ మహిళ కాలేయంలో నుంచి 2 లీటర్ల చీము గడ్డలు తొలగించి, ప్రాణాలను కాపాడారు. లక్ష్మణచాంద మండలం, వడ్యాల్ గ్రామానికి చెందిన గాయి పద్మ (55) జ్వరం, కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరింది. వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్జికల్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జీ.రాకేష్ తొలిసారిగా కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా మినిమల్ ఆక్సెస్ పద్ధతి ద్వారా కోత లేకుండా 2 లీటర్లకు పైగా చీము తొలగించారు. రోగి పూర్తిగా కోలుకుందని తెలిపారు. మెడికల్ కాలేజీ వచ్చిన తర్వాత సౌకర్యాలు చాలా మెరుగు పడ్డాయని క్లిష్టమైన రోగాలకు మంచి చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు



నవతెలంగాణ-తలమడుగు

ఎన్నికల కోడ్ నియామవళి పక్రియలో భాగంగా సోమవారం లక్ష్మీపూర్ లాల్‌ఘడ అంతర్‌రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మండల అధికారులతో పాటు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అధికారుల సూచన మేరకు ప్రజలు రూ.50వేల నగదు పైబడి తీసుకువెళ్లదని అన్నారు. ఒక వేళ తీసుకువెళ్లినట్లయితే తప్పకుండా నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలని అన్నారు. సంబంధిత రుజువు పత్రాలు లేనియెడల ఎట్టి పరిస్థితుల్లో విడిచి పెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. ప్రజలు గమనించి తమ విధులకు ఆటంకం కలిగించకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారి రవీందర్, రెవెన్యూ అధికారి మధుసూదన్, ఎస్సై దనశ్రీ, ఏఎస్సై సురేందర్ ఎక్సైజ్ అధికారి పోచ్చన్న, పంచాయతీ అధికారి మాణిక్ ప్రభు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను గ్రామంలో ఇంటింటికి వివరించాలని సూచించారు. గ్రామ, మండల, పట్టణంలోని వార్డు కమిటీలను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నార్నూర్

జిల్లా కేంద్రంలో సోమవారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించి, గాదిగూడ మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నిక నిర్వహణను డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వృకోధర్ పర్యవేక్షించారు. మండల అధ్యక్షుడిగా ఏ.మారుతి, ఉపాధ్యక్షులుగా ఎల్.మహేష్, ప్రధాన కార్యదర్శిగా కే అరవింద్, కార్యదర్శులుగా కృష్ణ, సాయి కాంత్, జిల్లా కౌన్సిలర్ సుద్ధోదన్, బాజీరావ్ నియమితులయ్యారు. అనంతరం కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని, విద్యా రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 30 శాతం బడ్జెట్ కేటాయించాలని అన్నారు. విద్యారంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలన్నారు.

21న పశువుల మార్కెట్ వేలం

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఈ నెల 21న పశువుల మార్కెట్ వేలం పాట నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి హరీష్ ఒక ప్రటకలో పేర్కొన్నారు. ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పశువుల మార్కెట్ వేలం పాట ఈ నెల 21 ఉదయం 11.30 నిమిషాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు, ఈ వేలం పాటలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీ చట్టం నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని, అలాగే రూ.50 వేలు డిపాజిట్ కట్టాలని, డిపాజిట్ దారులు మాత్రమే వేలం పాటలో పాల్గొనేందుకు అర్హులన్నారు. వేలం పాట పూర్తయిన తర్వాత వేలం పాట దక్కించుకున్న వారి డిపాజిట్ డబ్బులు ఆపి మిగతా వారి డబ్బులు తిరిగి ఇవ్వబడునని, వేలం పాటను దక్కించుకున్న వారు అదే రోజు డబ్బు కట్టాలన్నారు. వేలం పాటలో సరైన ధర రాని పక్షంలో రెండో పాటపై వేలం నిలిపివేయబడునని తెలిపారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు గ్రామ పంచాయతీ చట్టం నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని కోరారు.

కుష్టువ్యాధిపై అవగాహన

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని అక్కిని, పుల్లార, పిప్పర్‌గొంది, చౌప్పన్‌గూడ గ్రామాల్లో జరుగుతున్న కుష్టువ్యాధిపై సర్వే కార్యక్రమంతో పాటు పరీక్షలు నిర్వహించారు. కుష్టు వ్యాధిపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. పిప్పర్‌గొంది గ్రామంలోని ప్రయిమరీ పాఠశాలలో కూడా దీనిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మోదుబాయి, ఆశావర్కర్ సేవంత, జంగుబాయి, శీలాబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారు మోజులో పడి..

- రూ.1.43 లక్షలు మోసపోయిన యువకుడు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పిప్పర్‌గొంది గ్రామానికి చెందిన రాథోడ్ చంద్రకాంత్ కారు మోజులో పడి రూ.1.43 లక్షలు మోసపోయాడు. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో తక్కువ ధరకు కార్లు అమ్మబడును అనే ప్రకటన చూసి లైక్ కొట్టాడు. గుర్తు తెలియని వ్యక్తి నుండి ఫోన్ కాల్ రాగా అతని మాయలో పడి రూ.1.43 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ నెల ఐదో తేదీన ఫేస్‌బుక్‌లో తక్కువ ధరకు కార్లు అమ్మబడును అనే ప్రకటనకు లైక్ కొట్టాడు. దీంతో ఫోన్ నెంబర్ 8579861593 నుండి ఫోన్ కాల్ వచ్చింది. తాను అగర్వాల్ ఆర్మీ ఆఫీసర్ అంటూ పరిచయం చేసుకున్నాడు. మీకు కారు కావాల తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ నమ్మించాడు. దీంతో చంద్రకాంత్ నమ్మి రూ.1.35 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు సదరు వ్యక్తి నుండి తిరిగి ఫోన్ చేసి ట్రాన్స్‌ఫోర్ట్ చార్జీల పేరుతో రూ.మూడు వేలు పంపమనడంతో ఫోన్ నెంబర్ 89615592021 గూగుల్‌పే(యూపీఐ) చేశాడు. తిరిగి ఆరో తేదీన తాను ఫోన్ చేసి డాక్యుమెంట్ చార్జీలు, కంటైనర్ చార్జీల పేరుతో డబ్బులు పంపమని చెప్పడంతో విడతల వారీగా మొత్తం రూ.1.43 లక్షలు పంపించాడు. తిరిగి డబ్బులు పంపాలని ఫోన్ చేయడంతో నా దగ్గర డబ్బులు లేవని చంద్రకాంత్ చెప్పాడంతో ఫోన్ కట్ చేశాడు. తిరిగి ఆ నెంబర్‌కు ఫోన్ చేసిన కలవకపోవడంతో మోసపోయినట్టు గ్రహించి వాంకిడి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు. సామాజిక మాధ్యమంలో వచ్చే ప్రకటనలు, పోస్టుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. గుర్తు తెలియన ప్రకటన నమ్మి మోసపోవద్దని కోరారు.

ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా కమిషన్ జారీచేసిన నిబంధనలను ఎవరైన ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రావ్‌పేట్, హుడ్కిలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. హుడ్కిలి చెక్‌పోస్టు వద్ద డబ్బా గ్రామానికి చెందిన కుమురం నరేష్ అనే వ్యక్తి బొలేరో వాహనంలో రూ.ఐదు లక్షలు మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుండి డబ్బా గ్రామానికి వెళ్తుండగా నగదును పట్టుకున్నారు. కాగజ్‌నగర్‌కు చెందిన ఎండీ ఆరీఫ్ అనే వ్యక్తి మహారాష్ట్రలోని బల్లార్షా నుండి కాగజ్‌నగర్‌కు తన కారులో 17 ఎల్‌జీ మిక్సీ గ్రైడర్లు పట్టుకున్నారు. వీటి విలువ రూ.8493 ఉంటుందని, వారి వద్ద సరైన ధ్రువపత్రాలు లేనందున వాటిని స్వాధీనం చేసుకొని చెక్‌పోస్టు ఇన్‌చార్జి వీనాకు అప్పగించినట్టు తెలిపారు.

మావోయిస్టుల కదలికపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- ఎస్పీ సురేష్ కుమార్
- గ్రేహౌండ్స్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మావోయిస్టుల కదలికపై ప్రత్యేక నిఘా ఉంచడంలో ఈ ప్రత్యేక శిక్షణ ఉపయోగపడాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రేహౌండ్స్ పోలీస్ సిబ్బందికి వారం రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మొదటిరోజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది శారీరిక ధారుఢ్యం, మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా కోసం ఈ ట్రైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, మెలకువలు నేర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, చెక్ పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల ముమ్మర తనిఖీ, ఇతర పోలీస్ సంబంధిత విధుల నిర్వహణ పకడ్బందీగా చేయాలన్నారు. విధుల్లో మరింత రాటు తేలాలంటే శిక్షణ అవసరమవుతుందన్నారు. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపితే విలువ పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆసిఫాబాద్ సీఐ సతీష్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వారసంత వేలంపాట

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి గ్రామ పంచాయతీలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంత వేలం పాటను బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి రాధ, ప్రత్యేక అధికారి రమేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

నవతెలంగాణ-జైనూర్

ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సందీప్‌కుమార్ అన్నారు. సోమవారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో ఆసిఫాబాద్ నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీఎస్ 20టి8447 నెంబర్ గల ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్టు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టెట్‌కు సన్నద్ధం..!

- ఉపాధ్యాయ పోస్టులకు మరింత పెరగనున్న పోటీ
- ఉమ్మడి జిల్లాలో 25వేల మందికి పైగా అభ్యర్థులు
- గ్రంథాలయాలకు పెరిగిన అభ్యర్థుల తాకిడి
- ఈ నెల 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ



పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు (పాత చిత్రం)

నవతెలంగాణ-కెరమెరి

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాసేందుకు బీఎడ్, డీఎడ్ అభ్యర్థులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో అనేక మంది అభ్యర్థుల కోరిక మేరకు అంతకుముందుగానే టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే టెట్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో సర్కారు నిర్ణయం పట్ల ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మేరకు టెట్ షెడ్యూల్డ్‌ను ప్రభుత్వం గత వారం రోజుల క్రితం జారీ చేసిన విషయం విధితమే. దీంతో ఉమ్మడి జిల్లాలో అనేక మంది అభ్యర్థులు టెట్ కోసం సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఉపాధ్యాయ పోస్టులకు మరింత పోటీ పెరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోస్టులకు పోటీ తీవ్రం..!

ఉమ్మడి జిల్లాలో టెట్ కోసం వేలాది మంది అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. ప్రతీ ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాలని నిబంధన ఉన్నా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దీంతో టెట్ కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. టెట్‌లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని డీఎస్సీలో 20 శాతం మార్కులు వేటేజీ ఉండడంతో మరింత స్కోర్ చేసుకోవాలని అభ్యర్థులు కృతనిశ్చయంతో ఉన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో టెట్ నిర్వహించగా మళ్లీ మే నెలలో నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించడంతో తీవ్ర పోటీ నెలకొంది.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది వరకు అభ్యర్థులు పరీక్షలకు సిద్ధం అవుతుండగా టెట్ పరీక్ష నిర్వహణతో డీఎస్సీలో మరింత పోటీ ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టులను భర్తీ చేసేందుకు నిర్ణయించింది. అభ్యర్థుల వయోపరిమితి కూడా 46 సంవత్సరాలకు పెంచడం, తదితర కారణాలతో పోటీ మరింత పెరగనుందనే అభిప్రాయం ఉంది.

చదువుపై దృష్టి సారించేలా..

టెట్‌తో పాటు డీఎస్సీలో ఈసారి ఎలాగైన ఉద్యోగం పొందాలనే పట్టుదలతో అభ్యర్థులు పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. టెట్ పరీక్షకు గత ఏడాది నుంచి చదువుతున్న వారు అనేక మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రంథాలయాలకు అభ్యర్థులు వెళ్లడంతో కిక్కిరిసిపోతున్నాయి. అయితే టెట్ మే 20వ తేదీన ఉండటంతో పరీక్ష సమయం తక్కువగా ఉండటంతో గడువు పొడిగించాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. అలాగే కొత్త జిల్లాల వారీగా అన్ని వర్గాలకు ప్రభుత్వం ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీల వివరాలు ఇవి

పోస్టులు	ఆదిలాబాద్	ఆసిఫాబాద్	నిర్మల్	మంచిర్యాల
స్కూల్ అసిస్టెంట్‌లు	74	62	70	70
లాంగ్వేజ్ పండిట్‌లు	14	25	04	26
పీఈటీ	02	02	04	03
ఎస్జీటీలు	209	234	236	175
ఎస్ఏ(స్పె.ఎడ్యూకేషన్)	06	03	05	05
ఎస్జీటీ(స్పె.ఎడ్యూకేషన్)	19	15	23	18
మొత్తం	324	341	342	288

ప్రభుత్వ నిర్ణయంతో ప్రయోజనం

సీహెచ్ సౌమ్య, వాంకిడి



ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ జారీ చేయడం చాలా సంతోషంగా ఉంది.గతంలో టెట్ అర్హత సాధించని వారికి ప్రభుత్వం మళ్లీ టెట్ నోటిఫికేషన్ జారీ చేసి మేలు చేసింది. టెట్ అర్హత సాధిస్తే డీఎస్సీకి రాసేందుకు అవకాశం ఉంటుంది. పట్టుదలతో చదివి టెట్ లో మంచి మార్కులు సాధిస్తా.

ఉచిత శిక్షణ అందించాలి

వడాయి ధర్మారావు, కెరమెరి



టెట్, డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 100 మందికి చొప్పున అందిస్తారు. అలా కాకుండా డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి ఉచిత శిక్షణ తో పాటు వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలి.

న్యాయం కోసం డీఎస్పీ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం నామానగర్ గ్రామానికి చెందిన ఒక యువకుడు ఇటీవల మృతి చెందగా, ఇప్పటి వరకు బాధ్యులను అరెస్ట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం బాధిత కుటుంబ సభ్యులు డీఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కాగజ్‌నగర్ మండలం నామానగర్ గ్రామానికి చెందిన మేడి సత్యం, సుజాత దంపతుల కుమారుడు సాయికుమార్ ఈ నెల 11న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సాయికి ఇదే గ్రామానికి చెందిన ఒక యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. ఈ క్రమంలో సాయికుమార్ ఆ అమ్మాయి ఇంట్లోనే మృతి చెందాడు. మెడపై గాట్లు ఉండడంతో అమ్మాయి తరఫువారే హత్య చేసి ఉంటారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ వారం రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని ఆరోపిస్తూ డీఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. టౌన్ సీఐ శంకరయ్య ధర్నా స్థలానికి వచ్చి కుటుంబ సభ్యులకు నచ్చచెప్పారు. విచారణ కొనసాగుతోందని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం నిందితులను అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


జిల్లా కేంద్రానికి చేరిన అయోధ్య పాదయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కర్ణాటక రాష్ట్రం ఉడిపి నుంచి అయోధ్యకు బయలుదేరిన పాదయాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన 70 సంవత్సరాల వయసు గల లక్ష్మీపతి స్వామి అయోధ్యకు పాదయాత్రగా బయలుదేరారు. జిల్లా కేంద్రానికి చేరగా జిల్లాలో నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి స్వామి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం 2016లో ఉడిపి నుంచి పాదయాత్రగా అయోధ్యకు బయలుదేరడం జరిగిందన్నారు. ఇప్పటివరకు కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మీదుగా తెలంగాణ రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టనని తెలిపారు. మహారాష్ట్ర మీదుగా అయోధ్యకు వెళ్లనున్నట్టు తెలిపారు. రోజుకు 30 కిలోమీటర్ల మేరకు తన పాదయాత్ర కొనసాగుతుందని ఇప్పటివరకు 20 వేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయిందన్నారు. మరో మూడు నెలల్లో అయోధ్యకు చేరుకుంటానని స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాంద్రే విశాల్, గణేష్, శ్రావణ్ గౌడ్ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో మొదటి రోజు ఇద్దరు డిబార్

- ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు
- జిల్లాలో మొత్తంగా 99 శాతం హాజరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. దీనికి బాధ్యులను ఇద్దరు ఇన్విజిలేటర్లను విధుల నుండి తొలగించారు. జిల్లావ్యాప్తంగా 99శాతం హాజరు నమోదయింది.జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 సెంటర్లలో 6457 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాస్తుండగా కెరమెరి మండలం మోడీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సెంటర్‌లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది డిబార్ చేశారు. దీనికి బాధ్యులను చేస్తూ ఇద్దరు ఇన్విజిలేటర్లను కూడా వీధుల నుండి తొలగించారు. జిల్లాలో మొత్తం 6457 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానుండగా 6408 మంది హాజరు 49 మంది గైర్హాజరయ్యారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 99.24 విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పాటిస్తే బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు



ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు లోనికి తీసుకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో వారిని తనిఖీ చేసి పంపించారు. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కాగా పలు కేంద్రాలను ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా విద్యాధికారి అశోక్ జిల్లాలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షకు సంబంధం లేని వారు ఎవరిని కూడా లోపలికి అనుమతించకూడదన్నారు. ఆయనతో పాటు స్థానిక సీఐ సతీష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కెరమెరి మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు తెలుగు పేపర్‌కు 296 మందికి గాను 294 మంది విద్యార్థులు హాజరయ్యారు.మోడీ బాలికల ఆశ్రమ పాఠశాల లో 155మందికి గాను 153మంది. కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 141 గాను 141 మంది విద్యార్థులు హాజరయ్యారు. కెరమెరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రం వద్ద సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి పరీక్ష హాలులోకి పంపించారు. ఎస్సై జి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. మోడీ బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఆ సమయంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు మండల విద్యాధికారి కుడ్మేతసుధాకర్ తెలిపారు. కెరమెరి ఉన్నత పాఠశాలకు చెందిన ఒకరు, అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఒకర డిబార్ అయినట్లు తెలిపారు.

కౌటాల : మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమైనట్టు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఎస్ఐ మధూకర్ భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సిర్పూర్(టి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు పరీక్ష కేంద్రానికి సకాలంలో హాజరైనట్టు ఇన్‌చార్జి ఎంఈఓ సోమయ్య తెలిపారు. మండలంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో 195 మంది విద్యార్థులు, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో 181 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 199 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం మూడు కేంద్రాల్లో 575 మంది విద్యార్థులకు గాను 573 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మౌళిక వసతులు కల్పించారు. కేంద్రాల్లో ఎస్ఐ దీకొండ రమేష్ తమ సిబ్బందితో సర్వే చేయించారు. నేడు జరగబోయే పరీక్షకు విద్యార్థులు ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు.



వాంకిడి : సోమవారం మొదటిరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు ఎంఈఓ మనుకుమార్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పరీక్ష సమయానికి విద్యార్థులు కేంద్రాల వద్దకు చేరుకుని హాల్ టికెట్లను పరిశీలించుకున్నారు. అనంతరం కేంద్రంలో పరీక్షలు రాశారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రంలో మొత్తం 143 మంది విద్యార్థులకు గాను అందరు హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు సామాజిక కార్యకర్త తిరుపతి ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు మినరల్ వాటర్‌ను అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. జాగృతి అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరీక్ష అనంతరం విద్యార్థులకు జూస్‌లను పంపిణీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు పరిశీలించారు.



పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపెల్లి గ్రామ సమీపంలో గల సర్వేనెంబర్ 119లో లావుని పట్టాలకు సంబంధించిన డిజిటల్ పట్టాలు, బయోమెట్రిక్ పూర్తిచేసి పట్టాపాస్ పుస్తకాలను పట్టాదారుకు అందజేయాలని రైతులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు కొండపెల్లి గ్రామానికి చెందిన రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినతిపత్రం ఇచ్చినట్టు వారు తెలిపారు. పట్టాపాస్ పుస్తకాలు జారీ చేసి రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. పట్టా పుస్తాకాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తమ సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దుబ్బుల ఇస్తారి, సత్తన్న, పుల్లయ్య, శంకరి, పురుషోత్తం, భుజంగరావు, పరదేశీ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తలోడి గ్రామంలో సోమవారం పశు వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు మూగజీవాల పట్ల అప్రమత్తంగా ఉండి ఎలాంటి వ్యాధులు సోకిన తమకు సమాచారం అందించాలని, ఇంటికొచ్చి ఉచితంగా వైద్యమందిస్తామన్నారు. ఆయన వెంట వైద్యసిబ్బంది రాజన్న, ప్రశాంత్ ఉన్నారు.



పబ్లిక్ స్కూల్లో ప్రవేశానికి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల ఒక విద్యార్థిని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు సమక్షంలో ఎంపిక చేశారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సజీవన్‌తో కలిసి డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత విద్యాభ్యాసానికి 1వ తరగతిలో ప్రవేశాలకు జిల్లా నుండి ఒక విద్యార్థిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, కాగజ్‌నగర్ మండల కేంద్రానికి చెందిన ఆర్యన్ గవాడి ఎంపిక కాగా, వెయిటింగ్ లిస్టులో బెండారే హిమ్మాన్, దుర్గం భవ్యన్స్ ఉన్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-మందమర్రి

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం మందమర్రి పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన వారణాసి లక్ష్మణ్ చిర్రకుంట గ్రామంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా ట్రాలీలో తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి 3.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. లక్ష్మణ్ మండలంలోని చిర్రకుంట, శంకరపల్లి, మామిడి గట్టు పరిసర ప్రాంతాల్లోని ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తీసుకొని వెళ్లి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మత్స్య సహకార సంఘం ఎన్నిక

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని గడ్‌పూర్ గిరిజన మత్స్య ప్రాథమిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సహకార శాఖ జూనియర్ ఇన్స్‌పెక్టర్ జి.నితిన్ కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా గునిగంటి భూమయ్య, ఉపాధ్యక్షుడిగా మనబోతుల రాజయ్య, కార్యదర్శి మంగురపు శ్రీనివాస్, సభ్యులుగా ఏదుల భుమయ్య, మంగురపు కిష్టయ్య, తిరుసనేని అశోక్, గునిగంటి తిరుసయ్య, సార మల్లేష్, దాసందుల తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

సోషల్ మీడియా ప్రచార వివరాలు అందించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా పరిధిలో వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులకు సంబంధించి మొబైల్ నెట్వర్క్స్ బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ కాల్స్, మెసేజ్ల ద్వారా చేసే పూర్తి ప్రచార వివరాలను అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌లో కలిసి వివిధ మొబైల్ నెట్వర్క్ ప్రతినిధులతో ప్రచార సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల కార్యచరణ విడుదల అయిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులు చేసే ప్రచార కార్యక్రమాలలో భాగంగా వినియోగించే వివరాలను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, నెట్వర్క్ పరిధిలో జరిగే ప్రచార సంబంధిత పూర్తి వివరాలతో ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని తెలిపారు. అనుమతి కోసం ఎంసీఎంసీకి వచ్చిన దరఖాస్తులను అధికారులు పూర్తిగా పరిశీలించాలని, వివరాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉన్నట్లయితే అనుమతి ఇవ్వాలని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా బల్క్ ఎస్ఎంఎస్, వాయిస్ కాల్స్ , మెసేజ్ల ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారం నిర్వహించినట్లయితే వాటిని నిబంధనల ప్రకారం లెక్కించి వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలని తెలిపారు. పోలింగ్ రోజుకు 72 గంటల ముందు నుండి ఎలాంటి అనుమతులు జారీ చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, వివిధ మొబైల్ నెట్వర్క్ ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జైపూర్ మండలంలో సుందిళ్ల బ్యారేజ్ రోడ్డుతో పాటు రాజీవ్ రహదారిలో గోదావరి బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో సోమవారం వాహణాల తనిఖీని పర్యవేక్షించారు. ఈ సంధర్భంగా శ్రీరాంపూర్ సీఐ మోహన్‌తో కలిసి మాట్లాడుతూ వాహణాల్లో ప్రయాణిస్తున్న వారు వ్యక్తిగతంగా రూ.50 వేలకు మించి తరలించరాదని తెలిపారు. అదేవిధంగా నగదుకు తీసుకెల్తున్నప్పుడు వాటికి అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అధారాలు సరిగ్గా లేకుండా నగదు, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో లేకుంటే వాహణాలను సైతం సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. వాహణాల్లో మధ్యం తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించిన ఏసీపీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ శ్రీధర్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

జైపూర్ ఏసీపీని కలిసిన జీఎం

నస్పూర్ : జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లును శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి గనులు విభాగాలలో జరుగుతున్న దొంగతనాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాబోవు కాలంలో ఇటువంటి దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన అన్ని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారులకు నంది అవార్డు

నస్పూర్ : విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన నేషనల్ లెవెల్ కూచిపూడి నృత్యం ఫెస్టివల్‌ను హైదరాబాద్ భాస్కర్ ఆడిటోరియం బిర్లా సెంటర్లో మంచిర్యాల జిల్లా కూచిపూడి కళాకారులు ప్రతిభ కనబరిచారు. వారి ప్రతిభను గుర్తించి నంది అవార్డును ప్రధానం చేశారు. అనంతరం గురువు అన్నం కల్పనను శివ నంది అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు చక్కటి అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. భారతీయ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివిధ రాష్ట్రాలకు చెందిన నాట్యగురువులు హాజరయ్యారు. ఈ నాట్యోత్సవంలో మంచిర్యాల జిల్లా నుంచి శ్రీ నందిని నృత్యాలయం ఫౌండర్, గురువు, నేషనల్ లెవెల్ డా.ఏపీజే అబ్దుల్ కలాం ఎక్స్ లెన్స్ అవార్డు గ్రహీత, నాట్య విభూషణి అన్నం కల్పన శిష్య బృందం హర్షిత, మనస్వి, నికిత, ఆరాధ్య, సాధిక, అలోఖి, శ్రీనిక, జ్ఞాపిక, సృష్టి, చైత్ర, వినుజ, దీపాలి, తనుజ, అమర్త్య, కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ సాంప్రదాయ నృత్యాలన్నీ దేవుళ్లను ఆరాధిస్తూ కొనసాగుతాయని, అందుకే ఆయా అంశాలకు కళాకారులు పలికించే ఆ భగవంతున్ని సాక్షాత్కరిస్తాడని అన్నారు.

రేపల్లెవాడ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు

తాండూర్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రేపల్లెవాడ గ్రామ సమీపాన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం తాండూర్ సీఐ కే కుమారస్వామి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి మద్యం అనుమతి లేని నగదు రవాణా చేసినట్లయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 50 వేలకు మించి నగదు రవాణా చేసినట్లయితే సరి అయినైన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగే ఎందుకు తాండూర్ సర్కిల్ పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. మండలంలోని రౌడీ షీటర్లను తహసీల్దార్ ముందు బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఎన్నికల సందర్భంగా విధించిన ఆకాంక్షలను పాటించాలని ఏదైనా సమాచారం ఇవ్వవలసి ఉంటే 1950కు ఫోన్ చేసి చెప్పవచ్చని లేదా ఆన్‌లైన్ ద్వారా సమాచారం తెలుపాలనుకున్న వారు సి విజిల్ యాప్ ద్వారా కూడా సమాచారం అందజేయొచ్చని వారన్నారు. ఈ తనిఖీల్లో బెల్లంపల్లి ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ పోచయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

నవతెలంగాణ-నస్పూర్

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఒక వివాహ వేడుకకు హాజరైన ఆయన నస్పూర్ ప్రెస్ క్లబ్‌కు వచ్చారు. పలువురు జర్నలిస్టులు వారిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, లోక్సభ ఎన్నికల అనంతరం అర్హులైన వారికి అందరికీ అందేలా చూస్తామన్నారు. జర్నలిస్టులు అంటే ప్రజల్లో కొంత అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించి జర్నలిజం విలువలను పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

కోడేరు ఎంపీఓపై దాడి హేయం



నవతెలంగాణ-జన్నారం

నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు మండలం ఎంపీఓపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీఓ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండలంలోని గ్రామాల కార్యదర్శులతో మండల కార్యాలయ సిబ్బందితో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వంలో అన్ని శాఖల అంటే అత్యధికంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముంగిట్లోకి తీసుకువెళ్లి గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపిస్తున్న శాఖ పంచాయతీరాజ్ శాఖ, కానీ అట్లాంటి పంచాయతీరాజ్ శాఖలో అతి ముఖ్యమైన మండల పంచాయతీ(ఎంపీఈఓ) అధికారిపై మండల పరిషత్ అధ్యక్షులు దాడి చేయడం అమానుషమన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని దాడి చేసిన ఎంపీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే ఉరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, ఎజాజ్,, లావణ్య, మహేష్, పోన్కల్ ఈఓ రాహుల్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జైపూర్ : నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో ఎంపీఓపై దాడికి పాల్పడిన ఎంపీపీపై ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్, ఎంపీఓ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఎంపీఓపై దాడిని ఖండిస్తూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులపై దాడి చేయడం అమానుషమని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటం కోసం దాడి చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.



జైపూర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

● పీసీబీ సీనియర్ శాస్త్రవేత్త ప్రసన్న కుమార్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జాతీయ పర్యావరణ విద్యా సమన్వయకర్త, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ శాస్త్రవేత్త, డాక్టర్ డబ్ల్యూ జీ.ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో 'నీటి జాడ, దాని వినియోగం - ప్లాస్టిక్ వినియోగ నివారణ' అనే అంశంపై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో సమీకృత ఉపాధ్యాయ విద్యా విభాగం(ఐటీఈపీ) ఆధ్వర్యంలో జాతీయ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో మనకు తెలియకుండానే ఈ ప్రకృతి ఎన్నో సహజ జీవన మార్గాలను ఏర్పాటు చేసిందన్నారు. మానవుడు సహజ వనరులను కలుషితం చేసుకుంటూ తన మనుగడకు తానే ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నాడని తెలిపారు. అవసరమైన దాని కంటే అధిక వినియోగం, పర్యావరణాన్ని కాలుష్యం చేసే చర్యలు నేటి సమాజంలో అలవాటుగా మారుతున్నాయని పలు ఉదాహరణలతో వివరించారు. రాష్ట్ర కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం 1974 ప్రకారం ప్రతి ఒక్కరూ నీటి వినియోగం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక కప్పు కాఫీ తయారీకి 160 లీటర్స్, ఒక కంచి పట్టు చీర తయారీకి 30 వేల లీటర్స్ నీరు శాస్త్రీయంగా వినియోగం అవుతాయని విద్యార్థులకు తెలియజేశారు. నీటిని పొదుపుగా వాడకపోతే భవిష్యత్‌లో నీటి కోసం దేశాల మధ్య యుద్ధాలు జరిగే పరిస్థితులు వస్తాయన్నారు. అదే విధంగా ఒకసారి వాడిన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. ప్లాస్టిక్ భూతంతో ప్రాణగండం తప్పదన్నారు. తల్లి పాలు మొదలుకుని అన్నింటిలో నేడు ప్లాస్టిక్ ఉంటుందని ఉదాహరణలతో వివరించారు. అధ్యాపకురాలు పద్మ మాట్లాడుతూ విద్యార్థులకు సమీకృత ఉపాధ్యాయ జాతీయ విద్యా విధానంలో టీచింగ్ కరికులం ఎంతో ముఖ్యమైనదన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో టీచింగ్ ప్లాన్‌తోనే అనుకున్న స్థాయిలో ఫలితాలు రాబట్టవచ్చన్నారు. అదే విధంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అంతకు ముందు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జై కిషన్ ఓజా మాట్లాడుతూ అందరూ పర్యావరణ చట్టాలపై అవగాహన పెంచుకుంటే కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. అనంతరం ముఖ్య అతిధులను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం సమన్వయకర్త డా.పడాల తిరుపతి, వైస్ ప్రిన్సిపల్ డా. టీ గంగయ్య, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



కాసిపేట-2 గనిపై కార్మికుల ఆందోళన

● అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిపై సోమవారం కార్మికులు ఆందోళనకు దిగారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఇటీవల గని కార్మికుడి మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని, రక్షణ చర్యలు లేక గనిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మికుడు చనిపోతే కనీసం అంత్యక్రియలకు అధికారులు ఎవరూ రాకపోవడం దారుణమన్నారు. కార్మికులు చనిపోతే ఒక రకంగా, మైనింగ్ స్టాఫ్ చనిపోతే ఒక రకంగా అధికారులు వ్యత్యాసం చూపిస్తున్నారని మండిపడ్డారు. కాలం చెల్లిన పని మొట్లు, సామాగ్రి కార్మికులకు ఇస్తున్నారని, వాటిని మార్చాలని అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కార్మికుడు మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసిపేట-2 గని కార్మికుడు మందమర్రి వర్క్‌షాప్ వద్ద మృతి చెందిన సంఘటనలో కాలం చెల్లిన తాడు వాడకం వల్లే ప్రమాదం జరిగి మృతి చెందాడని, దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. గనిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రక్షణాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన సామాగ్రిని అందించి కార్మికుడి మృతి కారణమైన ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే గనిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని గని పైన బైఠాయించారు. దీంతో గని మేనేజర్ ఏజెంట్ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

నియమావళి అమలు బాధ్యత అధికారులదే

● తహసీల్దార్ రాఘవేంద్రరావు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఎన్నికల నియమావళి అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని తహసీల్దార్ రాఘవేంద్రరావ్ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల నియమావళి అమలు లోకి వచ్చిన సందర్భంగా మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా 16వ తేది నుంచి ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ప్రభుత్వ అధికారులు అందరూ ఎన్నికల కమిషన్ పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందన్నారు. నియమావళి అమలులోకి వచ్చిన 24 గంటలలోపే ప్రభుత్వ కార్యాలయాలల్లో ఏ నాయకుల ఫోటోలు కానీ, ప్రభుత్వానికి సంబంధించిన పోస్టర్‌లు కానీ, ఉండకూడదని, 48 గంటలలో పబ్లిక్ ప్లేసెస్‌లో కూడా ఎటువంటి పార్టీ సంబధిత పోస్టర్లు, సామాగ్రి ఉండకూడదని, 72 గంటలలో ప్రయివేట్ ఆస్తులపైన కూడా ఎటువంటి రాజకీయ పోస్టర్లు కానీ, రాతలు కానీ ఉండకూడదన్నారు. ఒకవేళ ఉంటే ఆ ఇంటి యజమాని అనుమతి తీసుకున్నారా లేదా చూడాలన్నారు. ఒక వేళ అనుమతి లేకపోతే వెంటనే కేసు నమోదు చేయలని సూచించారు. రూ.యాభై వేల కంటే ఎక్కువ నగదును తమ వెంట తీసుకెళ్లొద్దని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సై చంద్ర కుమార్, మండల అభివృద్ధి అధికారిణీ సరోజ, మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, ఎంఈఓ కే.రవీందర్, ఇంజనీర్ ఇ.గణేష్, ఏపీఎం లక్ష్మి, ఏపీఓ వెంకట రమణ పాల్గొన్నారు.



రూ.1.59లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-జన్నారం

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని ఇందన్‌పెల్లి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద సోమవారం రూ.లక్షా5900 నగదును పోలీసులు పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అక్కడ ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద లక్షేటిపేట సీఐ అల్లం నరేందర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో వ్యాన్‌లో సేల్స్‌మేన్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండల కేంద్రానికి చెందిన చిట్యాల పోచమల్లు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. లక్ష 5900 తీసుకెళ్తున్నట్టు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు చూపనందున ఆ డబ్బులను సీజ్ చేసినట్లు సీఐ నరేందర్ చెప్పారు. పట్టుకున్న డబ్బులను జన్నారం ఎస్ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు తెలిపారు.



నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ అజీమ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కరీంనగర్ చౌరస్తాలో మటన్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి తక్కువ ధరలకు మేకలు, గొర్రెలు తీసుకొస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా రోగాల బారిన పడిన వాటి మాంసాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారని గుర్తించినట్లు తెలిపారు. ప్రతి మటన్ షాపు వద్ద స్లాటర్ హౌస్ ఉండాలి, మున్సిపాలిటీ పరిధిలోని జీవాలను కోయడానికి వైద్యాధికారుల సమక్షంలో ఆరోగ్య పరీక్షలు జరిపించి స్టాంపింగ్ చేసి ధ్రువీకరించిన తర్వాత వధించాలన్సి ఉంటుందన్నారు. ఇది లేని కారణంగా దుకాణాల వద్ద విచ్చలవిడిగా కోస్తూ అమ్ముతున్నారని పేర్కొన్నారు. అనారోగ్యంగా ఉన్న గొర్రె, మేకలను విక్రయిస్తున్న సమాచారం మేరకు మటన్ షాపులలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది షాపుల్లో మాంసాన్ని సీజ్ చేసి పశు వైద్య అధికారి డా.ధనరాజ్ తెలిపారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పట్టణంలో మూడు, రామకృష్ణాపూర్‌లో మరో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 887 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం 8 గంటల నుండే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. విద్యార్థుల కోసం అత్యవసర ప్రాథమిక వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచారు.

జన్నారం : మండలంలో సోమవారం ఉదయం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. కేంద్రాలను ఎంఈఓ విజయ్ కుమార్ తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 616 మంది విద్యార్థులకు గాను 615 మంది హాజరై ఒకరు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను జన్నారం ఎస్సై సర్కార్ పరిశీలించారు.

గల్ఫ్ కార్మికుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

కొంత కాలంగా బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామానికి చేరుకొని మంచానికి పరిమితమైన ఖాదర్‌కు సహచరులు అండగా నిలిచారు. సోమవారం ఖాదర్ ఇంటికి వెళ్లి రూ.15 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ధ్యేయమని, బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి రకరకాల కారణాలతో ఇబ్బందులు పడుతున్న వారిని తమ సంఘం ఆధ్వర్యంలో ఆదుకుంటామన్నారు. అందులో భాగంగానే ఈ రోజు గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేయడం జరిగిందని రాష్ట్ర ఇన్‌చార్జి రాజు గౌడ్, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్ పాషా ఖాద్రి అన్నారు. ఆర్థిక సాయం అందజేసిన వారిలో ఎండి షాదిక్ బాబా, ఎరుకల రమేష్ గౌడ్, అంజన్న, రాజశేఖర్, కిరణ్, గుండారపు రాజేష్, సయ్యద్ సాదిక్, తిరుపతి, రాకేష్ గౌడ్, తాళ్లపెల్లి రాజేష్, దుమాల్ల లింగన్న, మహ్మద్ షకీర్, కట్లకుంట గంగన్న ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీదేవి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. లక్ష్మీదేవి బోనాల పండుగను పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితిగా ముదిరాజ్ కుటుంబాల వారు బోనాల పండుగ నిర్వహిస్తుండగా ఆలయ కమిటి, ముదిరాజ్ కుల సంఘం నాయకుల అభ్యర్థన మేరకు తాగు నీటి వసతి కల్పించడం కోసం రెండు బోరు బావులతో పాటు ఆలయం చుట్టు ప్రహరి నిర్మించేందుకు నిధుల కేటాయిస్తామని హామీ ఇచ్చారు. లక్ష్మీదేవి ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ముదిరాజ్ కుటుంబాల వారు డప్పు చప్పుల్లతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు పెండ్యాల మధు కార్యదర్శి పందుల మధు, ముదిరాజ్ కుల పెద్దలు యాదగిరి ధర్మయ్య, దబ్బెట రాములు, దబ్బెట ధర్మయ్య, దాసరి స్వామి, అన్నెవేని సారయ్య, జిల్లా కమిటి కార్యదర్శి గోస్కుల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలో పోషణ పక్షోత్సవాలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ఐబీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మమత సోమవారం పోషణపక్ష వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లులకు, పిల్లలకు పోషణకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. గర్భిణీ స్త్రీ తన తొమ్మిది నెలల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహారం వివరించారు. చిరుధాన్యాల వాడకం దాని పోషకాహారం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లలచే పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ లీలా రాణి, సుజాత పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

మందమర్రి : బెల్ట్ షాపులపై మందమర్రి పోలీసులు సోమవారం దాడులు చేసి మద్యాన్ని సీజ్ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొదటి జోన్‌కు చెందిన కొనగంటి సురేష్ తండ్రి చంద్రయ్య అనే వ్యక్తి కిరాణా దుకాణం నడుపుతూనే అక్రమంగా విక్రయిస్తున్న 74.91 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మద్యాన్ని సీజ్ చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ రాజశేఖర్, సిబ్బందిని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | మార్చి 19, 2024 | www.navatelangana.com

పశువులను చర్మవ్యాధుల నుంచి రక్షించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ



వేసవిలో పశువులకు వచ్చే చర్మవ్యాధుల నుంచి పశుపోషకులు రక్షించాలని, వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని సాత్‌నెంబర్ గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 180 ఆవులకు, 150 గేదెలకు, 80ఎద్దులకు గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శేఖర్, దేవు రావు, పశువుల యజమానులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి జిల్లా జట్టు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్ బోయన్ పెల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదవ తరగతి ప్రవేశం పరీక్ష కోసం నిర్వహిస్తున్న పోటీలకు జిల్లా జట్టు ఎంపిక కాగా సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ క్రీడా అధికారి బండమీనారెడ్డి మాట్లాడుతూ పది మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా జట్టు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, విద్యార్థులతో పాటు కోచ్ మేనేజర్లుగా మంగావతి సుమ వెళ్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డీటీడీఓ రమాదేవి, ఏటీడీఓ క్షేత్రయ్య, ఏసీఎంఓ పి.ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, పేట సెక్రెటరీ కృష్ణమూర్తి, హెచ్‌డబ్ల్యూ విజయశాంతి, పీడీలు వనిత, మధునయ్యలు అభినందించారు.



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్ సభ ఎన్నికలలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో జరిగే ఎన్నికల దృష్ట్యా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద నిర్వహిస్తున్న బందోబస్తు ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, తహసిల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేయడం జరుగుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, పోలీస్ అధికారుల సమన్వయంతో గట్టి బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గట్టి నిఘా

- రెండు రోజుల్లో రూ.14 లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ - సిర్పూర్(టి)

కేంద్ర ఎన్నికల కమీషన్ శుక్రవారం నుండి దేశవ్యాప్త ఎన్నికల కోడ్ విధించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను మండలంలో మహారాష్ట్ర సరిహద్దు, తెలంగాణ సరిహద్దు రాష్ట్రాల మధ్య ఉన్న హుడ్కిళి, వెంకట్రావ్‌పేట్ గ్రామాల్లో చెక్‌పోస్టుల వద్ద కౌటాల సీఐ సాదిక్‌పాషా, సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు రూ.14 లక్షల 28వేల నగదు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రూ.5,26560, రెండవ రోజు సోమవారం రూ.8,76303 నగదును పట్టుకున్నారు. ఈ సందర్భంగా కౌటాల సీఐ సాదిక్‌పాషా మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఇరురాష్ట్రాల ప్రజలు తమ ప్రయాణాల్లో నగదును, ప్రజలను ఆకర్షించే నజరాను రూ.50 వేలపైన విలువ చేసే వస్తువులను తమ వెంట తీసుకెళ్లద్దని, సరైన ధృవీకరణ పత్రాలు ఉంటేనే తీసుకెళ్లాలని, లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రజలు చెక్‌పోస్టుల వద్ద ఉన్న సిబ్బందితో సహకరించాలని కోరారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని డాక్టర్ దూద్‌రామ్ రాథోడ్ తెలిపారు. సోమవారం మావల మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమం ఈనెల 15 నుంచి వచ్చే నెల 5వరకు ఉంటుందని అన్నారు. అందులో భాగంగానే ఆవులకు, గేదెలకు, ఎడ్లకు టీకాలను వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పశువైద్య సిబ్బందికి సహకరించి తమ తమ పశువులకు టీకాలు వేయించాల్సిందిగా కోరారు. ఈ వ్యాధి వైరస్‌తోని వస్తుందన్నారు. ఒక పశువు నుంచి ఇంకో పశువుకు సంక్రమించుతుందన్నారు. ఒకవేళ వ్యాధి వచ్చిన ఎడల పశువులకు కాళ్ల డెక్కల మధ్య పుండ్లు ఏర్పడుట, నోటిలో పుండ్లు ఏర్పడుట పశువులు మేత మేయక పోవడం నిరసించి పోవడం, పాలిచ్చే గేదెలు ఆవులు పాల దిగుబడి తక్కువ కావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేందర్, కారోబారి దశరథ్, పశు వైద్య సిబ్బంది సాయి, ప్రసాద్, రమేష్, గోపాలమిత్రులు విలాస్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



నవతెలంగాణ-ఉట్నూర్

పదో తరగతి పరీక్షలు మొదటి రోజు నాలుగు కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయి. సోమవారం మొదటి పేపర్, మొదటి రోజు ఉండటంతో విద్యార్థులు సమయానికి సెంటర్ వద్ద చేరుకొని పరీక్షలు రాశారు. సెంటర్‌ల వద్ద 144సెక్షన్ అమలులో ఉన్నట్టు అధికారులు తెలిపారు.

లక్ష్మణచాంద : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఉండగా అందులో వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 138 మంది, లక్ష్మణచాంద పరీక్ష కేంద్రంలో 199 మంది విద్యార్థులు హజరయ్యారు. మొత్తం 337 మంది వందశాతం హజరయ్యారని ఎంఈఓ మధుసూదన్ తెలిపారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ జానకి పరిశీలించారు.

నార్నూర్ : పదో తరగతి పరీక్షల్లో మొదటి రోజు సోమవారం ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ ఆశన్న పేర్కొన్నారు. తాడిహత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాల కేంద్రంలో ఒకరు, గాదిగూడ మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఒకరు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఎస్పీఎం అడ్డు గోడల తొలగింపు

- తిరిగి లారీలను అడ్డు నిలిపిన యాజమాన్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు ఐదేళ్ల క్రితం ప్రధాన రహదారులకు అడ్డంగా నిర్మించిన గోడలను సోమవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక ఈఎస్ఐ మూలమలుపు వద్ద, ఎస్పీఎం క్రీడా మైదానం ముందు, బాలభారతి ఉన్నత పాఠశాల ముందు భాగంలో ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులను ఐదేండ్ల క్రితం ఎస్పీఎం యాజమాన్యం మూసివేసింది. ఈ రోడ్లకు అడ్డంగా గోడలను నిర్మించింది. అప్పుడే స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చినా, యాజమాన్యం వినకుండా తన ఆస్తులంటూ విచ్చలవిడిగా గోడలను నిర్మించింది. తమ మిల్లు పరిధిలోనే రోడ్లు ఉన్నాయనే కారణంతో ఈ గోడలను నిర్మించినా, అప్పట్లో మున్సిపాలిటీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, పాలకవర్గ సభ్యులు ఈ గోడలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. అదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కూడా ఈ గోడలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీనితో సోమవారం ఉదయమే మున్సిపల్ కమిషనర్ అంజయ్య జేసీబీ సహాయంతో ముందుగా ఈఎస్ఐ మూలమలుపు వద్ద గోడను తొలగించారు. ఛైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, పాలకవర్గ సభ్యులు కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారు. ఎస్పీఎం క్రీడా మైదానం ముందున్న గోడను తొలగించే సమయంలో ఎమ్మెల్యే హరీష్ బాబు కూడా అక్కడికి చేరుకొని మున్సిపల్ అధికారులకు సంఘీభావంగా నిలిచారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన మిల్లు సీనియర్ మేనేజర్ రమేష్‌రావుకు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయినా అధికారులు వెనక్కి తగ్గకుండా కూల్చివేత కార్యక్రమాన్ని కొనసాగించారు.



సాయంత్రానికి లారీలను అడ్డుగా నిలిపిన యాజమాన్యం...

కాగా బాలభారతి పాఠశాల ముందు నుండి ఎస్పీఎం క్రీడా మైదానానికి వెళ్లే రహదారిలో మిల్లుకు సంబంధించిన ముడిసరుకు ఉండడంతో యాజమాన్యం రెండు రోజుల గడువు కోరింది. ఇందుకు మున్సిపల్ అధికారులు అంగీకరించకపోవడంతో సాయంత్రం ఈ రహదారికి అడ్డంగా యాజమాన్యం లారీలను నిలిపింది. దీనితో మళ్లీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టౌన్ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఆర్ఎస్పీ నిర్ణయం మనోవేదనకు గురి చేసింది

- మమ్మల్ని సంప్రదించకుండానే బీఆర్ఎస్‌లో చేరారు
- బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీ ఛైర్మన్ సిడాం గణపతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సిర్పూరులో గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేశాం. గెలువకపోయినా 44 వేల పైచిలుకు ఓట్లు సాధించి పెట్టడంలో ప్రతీ ఒక్క కార్యకర్త కృషి ఉంది. గెలిచినా, ఓడినా ఇక్కడే ఉండి బహుజనుల సంక్షేమం కోసం పాటుపడుతా అంటే నమ్మి పని చేశాం. కాని మాకు చెప్పకుండానే ఏకపక్ష నిర్ణయంతో బీఆర్ఎస్‌లో చేరిక లాంటి నిర్ణయం తీసుకుంటాడని అనుకోలేదం'టూ మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ సిడాం గణపతి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారమే తాము హైదరాబాద్‌కు వెళ్లి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిశామని, కాని అపుడు కూడా తన నిర్ణయాన్ని ఆయన తమకు చెప్పలేదన్నారు. సోమవారం సోషల్ మీడియాలో వచ్చే వరకు ఆయన బీఆర్ఎస్‌లో చేరుతున్న విషయం తమకు తెలియదన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా తనకు కాని, ఇక్కడ ఎన్నికలలో ఆయన తరపున మద్దతు ఇచ్చిన పార్టీ శ్రేణులకు కూడా చెప్పకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం బాధకు గురి చేసిందన్నారు. ఓడినా, గెలిచినా ఇక్కడే ఉండి బహుజనుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, అందుకే తాను ఇక్కడే ఇల్లు కూడా తీసుకున్నట్లు చెపితే నమ్మి ఆయనకు పని చేస్తే ఈ విధంగా అన్యాయం చేయడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఆయన నియోజకవర్గానికి వస్తే ఖచ్చితంగా తాము నిలదీస్తామన్నారు. రాజకీయంగా తాము ఏ పార్టీలో ఉంటామనేది రెండు, మూడు రోజులలో చెపుతామన్నారు. నియోజకవర్గంలోని బీఎస్పీ కార్యకర్తలతో సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చి పత్రికాముఖంగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు షబ్బీర్ హుస్సేన్, మోతీరాం, శరత్, మహేష్ పాల్గొన్నారు.

అనుమానిత నగదు లావాదేవీలపై చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో బ్యాంకుల ద్వారా జరిగే నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని రెండు శాసనసభ నియోజకవర్గాలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాంక్‌ల పరిధిలో జరిగే అనుమానిత నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్యాంక్ పరిధిలో రూ. లక్ష కంటే ఎక్కువగా నగదు జమ అయిన, డ్రా చేసిన వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలని, ఒకే ఖాతా నుండి వివిధ ఖాతాలకు నగదు తరలింపు జరిగిన వివరాలను పరిశీలించాలని సూచించారు. నామినేషన్‌కు ముందే ఖాతా తెరిచేందుకు బ్యాంకులకు వచ్చే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అభ్యర్థుల కుటుంబ సభ్యులు, సంబంధీకులు, అనుచరుల ఖాతాల ద్వారా జరిగే నగదు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏమైనా అనుమానాలు ఉంటే పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని తెలిపారు. రూ.10 లక్షలకు మించి నగదు జమ అయిన, తీసుకున్నా ఆదాయ పన్ను శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.

అనధికార, అనుమానిత నగదు లావాదేవీల వివరాలను ఎన్నికల సంఘంచే సూచించిన నమూనాలో పొందుపర్చి నివేదిక అందించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి సంబంధించిన ఉత్తర్వులను అన్ని బ్యాంక్‌లకు అందించడం జరిగిందని, తప్పకుండా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం కోవ హనుమంతరావు, వివిధ బ్యాంకుల అధికారులు, రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిర్మల్ : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నగదు లావాదేవీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిబంధనలు, అధిక మొత్తం నగదు లావాదేవీలపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని అన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్న ఖాతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రతి రోజు బ్యాంకుల వారీగా లావాదేవీల రిపోర్టులను అందజేయాలని సూచించారు. ఏప్రిల్ 18 నుంచి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయనున్నందున వారికీ నూతన బ్యాంకు ఖాతాలను తెరువాలని అన్నారు. అనంతరం బ్యాంకు లావాదేవీలు, క్యూఆర్ కోడ్ వంటి అంశాలపై ఈడీఎం నదీమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, వివిధ బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టు విద్యుత్ మరమ్మత్తుల కోసం రూ.3.81 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటాలకు సోమవారం కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టాలను కన్నీళ్లను తుడిచే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. కడెం ప్రాజెక్ట్ మరమ్మత్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5.46 కోట్లు విడుదల చేసి, మళ్లీ విద్యుత్ మరమ్మత్తుల కోసం రూ.3.81 కోట్లు విడుదల చేయడం చాలా హర్షించదగ్గ విషయమని అన్నారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రత్యేక చొరవ వల్లే కడెం ప్రాజెక్టు నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.

దీనికి సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు, మండల రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్, మాజీ అధ్యక్షులు గొల్ల వెంకటేష్, భూషణ్, ముస్కు, మాదాస్, రాజేశ్వర్, రాజు, రఫీక్, బబ్లు, తాళ్లపల్లి రమేష్, రెంకల శ్రీనివాస్, కాల్వ తిరుపతి, తుమ్మల ప్రతాప్, మల్లయ్య, నారాయణ, శేఖర్, సోదని రాజన్న పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో పేదలకు చేయూత



నవతెలంగాణ-జైనూర్

పేద ప్రజలకు కల్యాణలక్ష్మి ఆర్థిక చేయూత ఇచ్చిందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని సుక్కుపల్లి, షేకుగూడ గ్రామాల్లో ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి పలు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణగా కళ్యాణలక్ష్మి పథకమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మహిళలకు ఆడబిడ్డలకు న్యాయం కోసం కళ్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ క్రింద గిరిజనులు ఎంతో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేద ప్రజలకు ఆడబిడ్డల కళ్యాణం కోసం ఆర్థిక సాయంతో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గిరిజన సంస్కృతి సాంప్రదాయాలతో వివాహానికి హాజరయ్యారు. వివాహానికి హాజరుకావడంతో నూతన వధూవరులు ఎమ్మెల్యే కోవలక్ష్మికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, నాయకులు సరస్వతి, మాజీ సర్పంచ్‌లు మెస్రం గోవింద్‌రావు, మెస్రం రాహుల్ పాల్గొన్నారు.

ఎంపీఓపై దాడి హేయమైన చర్య

- నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యదర్శుల నిరసన



నవతెలంగాణ-నార్నూర్

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎంపీఓపై స్థానిక ఎంపీపీ దాడి చేయడం హేమమైన చర్య అని టీపీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాడిగే రాజు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ముందు దాడిని ఖండిస్తూ తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ తరపున మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిపై ప్రభుత్వం వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకూడదని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిచే ఉద్యోగులపై ఇటువంటి దాడులు జరగడం హేయమైనా చర్య అన్నారు. ఇటువంటి చర్యలను ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఆనంద్, ఆయా గ్రామాల కార్యదర్శులు ఆత్రం శంకర్, జాదవ్ అనురాగ్, శ్రీనివాస్, రాజు, రమేష్, రామ్‌సింగ్, విజయ్, అఖీల్, దినేష్, కొల శేఖర్ ఉన్నారు.

మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తే చర్యలు

నవతెలంగాణ-తాంసి

పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మాస్ కాపియింగ్‌కు సిబ్బంది సహకరిస్తే చర్యలు తప్పవని, ఫ్లయింగ్ స్క్వాడ్ నారాయణ సిబ్బందికి సూచించారు. తాంసి, కప్పర్ల, అందర్‌బంద్, హైస్కూల్‌లలో పరీక్ష కేంద్రాలు కొనసాగాయి. తాంసి హైస్కూల్‌లో 155 విద్యార్థులు, కప్పర్ల హైస్కూల్ లో 233 మంది విద్యార్థులు, అందర్‌బంద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 115 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విష్ణు జాదవ్ తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించారు. మాస్ కాపియింగ్‌కు పాల్పడకుండా చూడాలని, చీఫ్ సూపరింటెండెంట్ ఆనంద్‌రావు, శ్రీధర్ రెడ్డి ఆదేశించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణ



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ బార్ అసోసియేషన్ నేపథ్యంలో సోమవారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు షేర్.నరేందర్, కొమ్మోజి రమణ స్వీకరించారు. మొదటి రోజు నామినేషన్‌లు అధ్యక్ష పదవికి ఒక నామినేషన్, ప్రధాన కార్యదర్శి పదవికి రెండు, ఉపాధ్యక్షుడి పదవికి, ట్రెజరీ పోస్టుకు, జాయింట్ సెక్రటరీ పోస్టుకు, గేమ్స్ అండ్ కల్చరల్ పోస్టుకు, లైబ్రరీ పోస్టుకి ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 20 వరకు ఉంటుందని, నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 22, ఎన్నికల నిర్వహణ 28న ఉంటుందని తెలిపారు. అలాగే అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి పాల్గొన్నారు.